
# అరియర్స్

కాకాని చక్రపాణి



“ఓహో నా భాగ్యమూ, అహ నా భాగ్యమూ!” అంటూ ఆనంద తన్మయత్వంతో చిందులు తొక్కుకుంటూ ఇంటి దారిపట్టాడు పరంధామయ్య.

అలా మహదానందంతో పరంధామయ్య ఉప్పొంగిపోవటానికి కారణముంది. “బకాయిలు బకాయిలు” అంటూ



కాంట్రాక్టర్లు గోలపెట్టారు కానీ, అది అరణ్యరోదనే అయింది. ప్రభుత్వ బొక్కసం ఖాళీ. అలాంటి సమయంలో పరంధామయ్య విజయం సాధించాడు. పదవీ విరమణ చేసిన ఆ బడుగు ఉపాధ్యాయుడి జీవితంలో అది ఘనకార్యమే. తను ఉద్యోగం చేస్తున్న కాలంలో ఏ నెలా అతను మొదటి తారీఖున జీతాన్నందుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వం దయతలచి ఏ రెండు మూడు నెలలకో గ్రాంట్లు మంజూరు చేసేది. మామూళ్లు చెల్లించందే బిల్లులు పాసయ్యేవి కావు. ధరలు పెరిగినట్టే.. మామూళ్లూ ఆ స్థాయికి ఎదిగాయి. ముళ్లున్నాయని మార్గంలో వెళ్లకుండా తప్పదు కదా! అప్పుడప్పుడూ ప్రభుత్వం జీతాలు పెంచేది; పెంచుతున్నామని ప్రకటనలిచ్చేది. అవి అమలయ్యేందుకు సంవత్సరాలు పట్టేవి. బ్యూరోక్రసీ అందుకే ... ప్రభుత్వాదేశాలు వెంటనే అమలు కానివ్వకుండా చూడటానికి ఉంది. అందువల్ల అరియెర్స్ పెరిగిపోయేవి. ఆ బిల్లులు చూస్తూ ఉంటే ప్రభుత్వోద్యోగులకు కంటగింపుగా ఉండేది. అవి సక్రమంగా చెల్లింపులయ్యేవి కావు. అలాంటి అరియెర్స్ ఓ రెండు లక్షల రూపాయలు పరంధామయ్యకు ఇవ్వాలి ప్రభుత్వం. పదవీ విరమణ చేసి నాలుగేళ్లయినా అతనికి బకాయిలు చెల్లించలేదు ప్రభుత్వం. ఈలోపల అప్పులు పెరిగిపోయాయి. పెన్షన్ డబ్బు ఏమూలకీ సరిపోవటంలేదు. అక్కడికీ రెండు మూడు ట్యూషన్లు చెప్పుకుంటూ జీవితం వెళ్లమారుస్తున్నాడు. కానీ, ఆ సంపాదన వడ్డీలు కట్టటానికే చాలటంలేదు. అదిగో, అలాంటి తరుణంలో, తన తీవ్ర ప్రయత్నాల కారణంగా, రావల్సిన బకాయిలో నాలుగోవంతు సంపాదించగలిగాడు. బకాయిలు చెల్లించేది ప్రతి ఏటా మార్చి నెలలోనే. అలా పని జరగకుండానే ఎన్నో మార్చి నెలలు గతించాయి, కానీ ఇప్పటివరకూ మోక్షం కలగలేదు. భగీరథుడు సురగంగను భువిపైకి దింపాడంటారు. అది పుక్కిటి పురాణం. పరంధామయ్య యాభైవేల రూపాయలు, రావాల్సిన బకాయిల్లో ఇరవైఐదు శాతమయినా - ప్రభుత్వాన్నుండి వసూలు చేసుకోగలగటం వాస్తవం. అందుకతను మహదానంతో పాట పాడుకోవటంలో ఆశ్చర్యమేముంది!

ఈ అరియెర్స్ వసూలు చేసుకునే ప్రయత్నంలో భాగంగానే ఓ ఎమ్మెల్యేగారిని సందర్శించాడతను.

"అయ్యా, బాబూ, నా పరిస్థితి ఇది. నేను రిటైరై నాలుగేళ్లయింది. కాళ్లరిగేట్టు తిరుగుతున్నా కానీ, ప్రభుత్వం నా బకాయిలు చెల్లించటంలేదు. తమరు కల్పించుకుంటే, నా పనయిపోతుంది. ఈ దీనుడి మీద ప్రభువులు కనికరించాలి!" అని అభ్యర్థించాడు పరంధామయ్య.

"నువ్వు మా పదవులు చూసి ఎంతో ఆశ పెట్టుకున్నట్టున్నావు. మా పరిస్థితి గోచీకి ఎక్కువ గావంచాకు తక్కువ అన్నట్టుంది. రాష్ట్రంలో మంత్రుల మాటలకే లెక్కలేదు. ఇంక మాబోటి బడుగు ఎమ్మెల్యేలను పట్టించుకునేదెవడు? కనుక నా వల్లేం కాదు. పైన ఆ దేవుడున్నాడు. ఎప్పుడోప్పుడు నీ అరియర్స్ నీకు ముట్టకపోతాయా?" అన్నాడాయన.

"అయ్య బాబో! మీరే అలా అంటే నా కింక గోదారే గతి!" అని మొత్తుకున్నాడు పరంధామయ్య.

"బాగుందయ్యా నీ గోడు! తన దూర సందు లేదు, మెడకో డోలా? మేం, ప్రజా ప్రతినిధులం అంటూ గొప్పలు చెప్పుకోవటమే కానీ మా వల్లేం కాదు. మేం మా 'గౌరవభృతి'తో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. పై అలవెన్సులు మంజూరు కావటంలేదు. అవి వచ్చాయా అంటూ అసెంబ్లీ చుట్టూ ప్రదక్షిణం చేయటమే మా పనయిపోతున్నది. కారు లోనుకోసం అప్లయ్ చేసుకున్నాను. కొత్త సభ ఏర్పడి ఆరు నెలలు దాటినా ఇప్పటి వరకు లోను మంజూరు కాలేదు. ఎలాగో లోను మంజూరు అవుతుంది కదా అన్న భరోసాతో అప్పుచేసి కారు కొన్నాను. దానికి వడ్డీ కట్టలేక చస్తున్నాను కానీ లోను శాంక్షనయ్యే సూచనలేం కనిపించటంలేదు. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది. నేను అధికారపక్షం ఎమ్మెల్యేనే. అయినా ప్రయోజనం లేదు. నా పరిస్థితే ఇలా ఉంటే నేనేం నీకు సాయం చెయ్యగలను. వెళ్లు, వెళ్లు!" అన్నాడాయన.

రాజకీయ నాయకుల వల్ల ప్రయోజనం ఉండదని పరంధామయ్య కర్థమైపోయింది. ప్రభుత్వాధికార్లు పట్టించుకుంటే పనవుతుందని ఎవరో చెప్తే, ఆ ప్రయత్నమూ చేద్దామని ఓ తెలిసిన మిత్రుడి ద్వారా సెక్రటేరియట్‌లో ఓ ప్రభుత్వ కార్యదర్శిని కలిశాడు అతను.

"ప్రభుత్వాన్ని నడిపేది బ్యూరోక్రసీనే కదయ్యా! ఆ సెక్రటరీగారు నాకు బంధువు. నా మాట కాదనడు. నీ పనయిపోతుంది, వర్రీ అవకు!" అని నమ్మబలికి ఆ కార్యదర్శిగారి దగ్గరకు తీసుకువెళ్లాడు మిత్రుడు రామదాసు.

నిజమే ననుకున్నాడు పరంధామయ్య. ఈసారి పరంధామయ్య గోడు రామదాసే వెల్లడించాడు కార్యదర్శికి.

"ఏమిటి అరియెర్సా?" అంటూ ఉలిక్కిపడ్డాడు కార్యదర్శి.

"అవును, సార్! నాలుగేళ్ల నుండి ఎదురు చూస్తున్నాను. తమరు దయ వుంచాలి!" అని చెప్పుకున్నాడు పరంధామయ్య.

"మీ పరిస్థితి చూస్తే నాకు జాలి వేస్తోంది. నాకూ సాయం చెయ్యాలనే ఉంది. కానీ, ఏం చేయలేని పరిస్థితి నాది. అసలు రాష్ట్ర బొక్కసంలో డబ్బెక్కడిది? ప్రభుత్వాధికార్లకే జీతాలు తప్ప మరే బిల్లులు ప్రభుత్వంవారు చేయటంలేదు. నా టి.ఏ. బిల్లులు పాసయి మూడు నెల్లయింది. మరి మీ విషయంలో నేనేం చెయ్యలేను. మీరు పెద్ద మనసు చేసుకుని నన్ను క్షమించెయ్యండి!" అన్నాడాయన.

పరంధామయ్య కర్థమైంది ఆయన వివశత్వం. తనపట్ల జాలి ఉంది. కానీ ఏం చెయ్యలేని పరిస్థితి. కానీ జాలివల్ల తనకేం ప్రయోజనం కలగదు.

"దిగులుపడకు. వచ్చే ఏడు ప్రయత్నం చేద్దాం!" అన్నాడు మిత్రుడు రామదాసు.

అయితే, మళ్లీ వచ్చే మార్చిదాకా అప్పులవాళ్లు ఊర్కోరు. తన ప్రాణం తీసిపారేస్తారు. ఎవరో పాఠశాల విద్యాశాఖాధికారిని కలిస్తే ప్రయోజనముంటుందని చెప్పారు. కానీ, ఆ ప్రయత్నమూ ఫలించలేదు. అలా 'పిల్లర్ టు పోర్టు'కు కాళ్లరిగేలా తిరిగే సమయంలో ఓ మిత్రుడు సలహా ఇచ్చాడు : "నీకు జ్ఞానోదయ మెప్పుడవుతుందో నాకు అర్థం కావటంలేదు. ప్రభుత్వాన్ని నడిపేది రాజకీయ నాయకులూ, ప్రభుత్వాధికార్లూ అనుకుంటున్నావా? ప్రభుత్వాన్ని నడిపేది తెల్ల కాలర్ల చిరుద్యోగులు. వాళ్లు నోట్‌లు పెడితేనే క్రిందినుండి.. పై దాకా 'ఎస్, ఎస్' అంటూ సంతకాలయి కిందకొచ్చి, అవే ప్రభుత్వాదేశాలుగా వెలువడతాయి. బ్రిటీషువారు మనకు పెట్టిన భిక్ష ఇదే. ఈ చిల్లర దేవుళ్లను ప్రసన్నం చేసుకున్నామంటే మన పని అయిపోవటం ఖాయం. పద, నాకు తెలిసిన ఓ చిల్లర దేవుడున్నాడు, విద్యాశాఖలో!" అంటూ అతను పరంధామయ్యను అక్కడకు తీసుకువెళ్లాడు.

పరంధామయ్య, అతని మిత్రుడు కొండదేవరా ఆ చిరుదేవుడి టేబుల్ ముందు ఓ అరగంట నిలబడ్డారు. అప్పుడు కానీ అతను తల పైకెత్తలేదు. కొండదేవర పరంధామయ్య కేసు వివరించాడు చిరుదేవుడికి.

"రెండు లక్షలు అరియెర్స్ రావాలంటే కష్టం!" అన్నాడు చిరుదేవుడు.

"తమ రెంత ఇప్పిస్తే అదే పదివేలు!" అన్నాడు పరంధామయ్య.

"పది వేలయితే ఫర్లేదు, ఇప్పిస్తాను!"

"పదివేలంటే పదివేలు కాదు, సార్! మీకు దయ కలిగినంత పెద్ద మొత్తం ఇప్పించండి!"

"సరే, చూస్తాను. ఏమిస్తావ్?" అడిగాడు చిరుదేవుడు.

"తమ దయ సార్, తమరేదివ్వమంటే అది సమర్పించుకుంటాను."

"టెన్ పర్సెంట్!"

"అంతిచ్చుకోలేను. బీదవాణ్ణి కనికరించి తమరు ..."

"సర్లే, వెళ్లు. చూస్తాం!"

ఈ "చూస్తాం" అనే మాటను అతను నాలుగేళ్లనుండీ వింటూనే ఉన్నాడు. అది మృత్యుదండనే. ఆ మాట వింటూనే వణుకు పుట్టింది పరంధామయ్యకు.

"అయ్యబాబో, అలాగే సమర్పించుకుంటాను!" అన్నాడు.

"అయితే మార్చి 31వ తారీఖున వచ్చి కలువు. నాకు చేతనయినంత నీ కిప్పిస్తాను!" అన్నాడు చిరుదేవుడు.

ఆ మాత్రం ఆశ్వాసన ఇచ్చినవాడు ఈ నాలుగేళ్లలో మరెవరూ దొరకలేదు పరంధామయ్యకు. అయితే కొండదేవరకు అనుమానమొచ్చింది. చిరుదేవుడు మాట ఇచ్చాడు కానీ, నిలుపుకుంటాడో, లేదో. అందుకే కొంత ఎడ్వాన్సు పడేసి మాటను ఖరారు చేసుకోవాలనుకున్నాడు.

"మరి అడ్వాన్సు ..." అని నసిగాడు.

"అది మామూలే. ముందు ఓ రెండు వేలిస్తే, మిగతాది పనయ్యాక ఇవ్వవచ్చు!" అన్నాడు చిరుదేవుడు.

"ఓ రెండు రోజుల్లో సమర్పించుకుంటాను!" చెప్పాడు పరంధామయ్య.


"మంచిది!" అంటూ చిరుదేవుడింక ఫైలులో తల దూర్చాడు. అంటే 'ఇంక వెళ్లిపో!' అని అర్థం.

పరంధామయ్యా, కొండదేవరా బయటకొచ్చారు.

"ఇతను మహా నీతిమంతుడు. మాటకు కట్టుబడే మనిషి. నీ పనయిపోతుంది, మరేం దిగులుపడకు!" అని మరోసారి ధైర్యం చెప్పి వెళ్లిపోయాడు కొండదేవర.

మర్నాడు భార్య మెడలో గొలుసు కుదువబెట్టి రెండు వేలు సమర్పించుకున్నాడు పరంధామయ్య చిరుదేవుడికి. అయితే, ఆ తర్వాత కూడా పరంధామయ్య పని సీదాగా జరగలేదు.

ఎందుకైనా మంచిది, ఓసారి తన విషయం చిరుదేవుడికి గుర్తుచేద్దామని పరంధామయ్య ఆఫీసుకు వెళ్లాడు. అది మార్చి 26వ తారీఖు. ఇంక వారం రోజుల్లో తన అదృష్టం ఎలా ఉందో తేలిపోతుంది. తీరా ఎండకు మాడుతూ ఆఫీసుకు



వెళ్లిన పరంధామయ్యకు చిరుదేవుడు సీటులో కనిపించలేదు. బేరాలు కుదుర్చుకోటానికి బయటికెళ్లాడేమో ననుకుని ఓ అరగంట నిరీక్షించాడు అతనికోసం. చిరుదేవుడు పత్తాలేడు.

"సార్! చిరుదేవుడుగారు ఎక్కడికో వెళ్లినట్టున్నారు!" అని పక్కసీటు చిల్లరదేవుణ్ణి అడిగారు పరంధామయ్య.

"ఇవాళ రాలేదు. సెలవు పెట్టాడు. వాళ్ల అమ్మగారికి ఒంట్లో బావుండలేదు!" అని చెప్పాడతను.

"ఏమైంది?"

"గుండెజబ్బట."

పరంధామయ్య పై ప్రాణం పైనే పోయింది. ఏం చెయ్యాలో తోచలేదు. పక్కసీటు చిల్లరదేవుణ్ణి బతిమాలి, బామాలి చిరుదేవుడి అడ్రసు సంపాదించి అతని ఇంటికి వెళ్లాడు. ఆ రోజు రాత్రి పదిగంటలదాకా చిరుదేవుడి ఇంటి ముందు పడిగాపులు పడితే కానీ చిరుదేవుడి దర్శనం కాలేదు. అమ్మగారి దగ్గర ఆస్పత్రిలోనే ఉన్నాట్ట. మళ్లీ పొద్దున్నే లేచి బస్సులు పట్టుకుని ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న చిరుదేవుడింటికి వెళ్లాడు పరంధామయ్య. అతను వెళ్లేసరికి అప్పుడే కాఫీ తాగుతూ పేపరు చూస్తున్నాడు చిరుదేవుడు.

పరంధామయ్య ముఖం చూడగానే దరిద్ర దేవతను చూసినట్టుంది చిరుదేవుడికి. చిరాకు కలిగింది అతనికి.

"ఏం పని? ఎందుకొచ్చావ్?" అనడిగాడు.

"అమ్మగారికి ఆరోగ్యం సరిగా లేదట. తమరు ఆఫీసుకు రాలేదు. అమ్మగారు ఎలా ఉన్నారో విచారించి పోదామని వచ్చాను!" అని నసిగాడు పరంధామయ్య.

"అవును, హార్ట్ ఎటాక్ వచ్చింది. ఏమవుతుందో చెప్పలేం!"

అలాంటి పరిస్థితిలో పరంధామయ్యకు తన పని గుర్తుచేయటానికి మనస్కరించలేదు. ఈసారి కూడా తనకు అరియర్స్ ముట్టే యోగం లేదు. భగవంతుడలా నిర్ణయిస్తే తనేం చేయగలడు? విధిని నిందించుకుంటూ వెళ్లిపోదామని వెనక్కి తిరిగిన పరంధామయ్యకు చిరుదేవుడి పిలుపు వినవచ్చింది.

"మీ పేరు పరంధామయ్య కదూ? రండి, కూర్చోండి!" అని పరంధామయ్యకు సోఫాలో కూర్చోమని ఆదేశిస్తూ, "ఇదుగో, ఓ కాఫీ పట్రా!" అంటూ భార్య నుద్దేశించి కేక పెట్టాడు చిరుదేవుడు. అతనేం చెప్తాడోనని ఒళ్లంతా చెవులు చేసుకుని బుద్ధిగా సోఫాలో కూర్చున్నాడు పరంధామయ్య.

"మా అమ్మగారికి ఏమాత్రం బాగాలేదు. ఇవాళో, రేపో అంటున్నారు. ఆస్పత్రిలో ఆవిణ్ణి చూసేవాళ్లు లేరు. నాకేమో ఆఫీసు కెళ్లకుండా

> "ఈ మూడు రోజుల్లోనూ పరంధామయ్యకు ఆమెపట్ల కొంత ఆత్మీయత ఏర్పడింది. ఆమె అతన్ని చూసింది లేదు, మాట్లాడింది లేదు. కానీ, మరణపు వాకిలికి చేరువ చేసే ఆమె ప్రతి కదలికా అతని గుండెను పిండిచేసింది. ఆమె ఒంటరితనం, వివశత్వం అతణ్ణి విహ్వలుణ్ణి చేసింది."



కుదరదు. ఇది రష్ పీరియడ్ కదా, సెలవు దొరకదు. మీలాంటి వాళ్లకు సాయం చెయ్యాలన్నా అదను ఇదే. ఆసుపత్రిలో అమ్మను కనిపెట్టుకుని ఓ మనిషి ఉండక తప్పదు. ఆసుపత్రి ఖర్చు కూడా విపరీతంగా ఉంది. నాకేం చేయాలో పాలుపోవటంలేదు!" అన్నాడు చిరుదేవుడు.

ఆసుపత్రి ఖర్చుంది కనుక మరింత డబ్బు పట్టుకురమ్మంటాడేమోనన్న భయం పట్టుకుంది పరంధామయ్యకు. తన్నింక ఈడ్చి తన్నినా మరి పైసా పుట్టదు. ఇంక తన అరియెర్స్‌కు నీళ్లు వదులుకోవటమే ఉత్తమమన్న ఆలోచన కొచ్చాడు పరంధామయ్య.

"అహా, భయపడకండి. మిమ్మల్నేం డబ్బడగటంలేదు. మీ కెలాగూ జరూరు పనులుండవు కనుక, రెండు రోజులు ఆసుపత్రిలో మా అమ్మగారి దగ్గర ఉంటారేమోనని అడుగుదామనుకుంటున్నాను. నేను ఆఫీసు కెళ్లకపోతే మీ పని కాదు. అమ్మ దగ్గరుండే మనుషులెవరూ లేరు కనుక నాకు సెలవు పెట్టక తప్పదు!" అన్నాడు చిరుదేవుడు.


నిజానికి మార్చి నెల చివరివారం ప్రాణాంతకమైనా ఆఫీసుకు వెళ్లక తప్పదు చిరుదేవుడికి. భక్తులు భారీగా ముడుపులు చెల్లించుకునేదప్పుడే. అలాంటి సమయంలో తల్లి హార్ట్ అటాక్ తెచ్చుకోవటం అతనికి చిరాకు కలిగించింది. ఇలా సమయం సందర్భం లేకుండా ప్రవర్తించే మనుషులంటే అతనికెప్పుడూ మంటే. కానీ తప్పదు. తల్లి దగ్గరెవరో ఒకళ్లు ఉండాలి. పిల్లలు స్కూళ్లకు వెళ్లాలి. భార్యకూ, తల్లికీ ఎప్పుడూ పడేది కాదు. ఈ సమయంలో 'ఆస్పత్రిలో ఉండటం నా వల్ల కాదు' అని బిర్రబిగిసి కూర్చున్నది ఆమె. తల్లికి తనొక్కడే కొడుకు. అక్కా చెల్లెళ్లు కూడా ఎవరూ లేరు. 'ఈ పరిస్థితి నెలా నెట్టుకురావాలా' అని చిరుదేవుడు చింతిస్తున్న తరుణంలో పరంధామయ్య రాక అతనికి ఆనందం కలిగించింది. పంతుళ్ల పాడు ముఖాలు దరిద్రపు గొట్టు మొఖాలంటే అతనికెప్పుడూ చిరాకే. కానీ, దరిద్రపుగొట్టు ముఖాలవల్ల కూడా ప్రయోజనముంటుందని అతని కప్పుడే తెలిసింది.

పరంధామయ్యకీ గత్యంతరం లేదు. డబ్బంటే తనవల్ల కాదు గానీ, శారీరక శ్రమ చెయ్యటానికీ, అందునా ఆపదలో ఉన్న మనిషికి సేవ చెయ్యటానికి వెనుకాడే మనిషి కాదతను. పైగా చిరుదేవుడు తనకంత సాయం చేస్తున్నాడు, ఉపకృతిగా తనేం చేయకపోతే బావుండదనిపించింది పరంధామయ్యకు.

"అయ్యా! తమరంతలా అభ్యర్థించాలా? తమరి అమ్మగార్ని మా అమ్మలా చూసుకుంటాను. తమరు నా విషయంలో కృపాదృష్టి జరపాలి!" అన్నాడు పరంధామయ్య.

"ఆ విషయంలో మీరేం భయపడకండి. నా చేతనైనంత సాయం నేను చేస్తాను!" అన్నాడు చిరుదేవుడు.

అలా మాట ఇచ్చిన పరంధామయ్య చిరుదేవుడి తల్లికి సేవచేస్తూ మూడు రోజులు ఆస్పత్రిలో ఉన్నాడు. ప్రైవేటు ఆస్పత్రి కనుక రాకపోకలకి




ఇబ్బంది కలగలేదు. అతను ఆస్పత్రిలో ఉన్న మూడురోజులూ ముసలావిడ అపస్మారకంలోనే ఉంది. డాక్టర్లు శతవిధాల ప్రయత్నించారు. చిరుదేవుడు మాత్రం రోజులో ఓ సారి అలా వచ్చి వెళ్లేవాడు. అతని భార్య అసలు ఆస్పత్రికే రాలేదు. కొడుక్కు మరింత ఇబ్బంది కలిగించకుండా చిరుదేవుడి తల్లి మార్చి 29 అర్ధరాత్రికల్లా ప్రేమ, గౌరవాల్లేని ఈ లోకం నుండి పైకి పయనం కట్టేసింది.

ఈ మూడు రోజుల్లోనూ వరంధామయ్యకు ఆమెపట్ల కొంత ఆత్మీయత ఏర్పడింది. ఆమె అతన్ని చూసింది లేదు, మాట్లాడింది లేదు. కానీ, మరణపు వాకిలికి చేరువ చేసే ఆమె ప్రతి కదలికా అతని గుండెను పిండిచేసేంది. ఆమె ఒంటరితనం, వివశత్వం అతణ్ణి విహ్వలుణ్ణి చేసింది. తల్లి పోయిన దుర్వార్త అతని కెలా చెప్పాలా అని మధనపడ్తూ, ఆటోలో వెళ్లే డబ్బుల్లేక, పది కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి, చిరుదేవుడి ఇంటి తలుపు తట్టాడు వరంధామయ్య.

"అమ్మ పోయింది!" అని చెప్పాడు.

"అర్ధరాత్రప్పుడు అంత పడుతూ లేస్తూ రాకపోతే, పొద్దున్నొచ్చి చెప్పొచ్చుగా!" అని కసురుకున్నాడు చిరుదేవుడు.

అయితే, అలా చెప్పటం వల్లే చిరుదేవుడి తల్లి దహనానికి ఏర్పాట్లు చేయటం తేలికైంది. అంత్యక్రియలు చేసి అతను పన్నెండు గంటలకల్లా ఆఫీసుకు వెళ్లటానికి వీలు కలిగింది.

మార్చి 31వ తారీఖు మహత్తరమైన రోజు. ముడుపులు చెల్లించినవాళ్లకు, అజ్ఞానంతో శాంక్షనయిన మొత్తాలను ఉపయోగించని యూనిట్లనుండి డబ్బును ఎడ్జెస్ట్ చేసి, బకాయిలు చెల్లించే అవకాశం చిల్లరదేవుళ్లకు ఉంటుంది. చిరుదేవుడు ఆ అవకాశాన్ని వినియోగించుకుని వరంధామయ్యకు ఇరవై అయిదుశాతం అంటే ఏభైవేల రూపాయలు మంజూరు చెయ్యగలిగాడు. పాపం, అతను వరంధామయ్యకు ఇంకా ఎక్కువగా ఇప్పిద్దామనే ప్రయత్నం చేశాడు కానీ ఇంకా చాలామంది బడుగుజీవులున్నారు కదా, వాళ్లనూ ఏ మేరనో తృప్తిపరచాలి కదా! ఇందులో కొంతమంది ముడుపులు చెల్లించినవాళ్లకు కూడా అతనేం చేయలేకపోయాడు. రాష్ట్ర ఆర్థికపరిస్థితిని అతను తప్పు పట్టేం ప్రయోజనం, వరంధామయ్య పనయ్యేటప్పటికి రాత్రి పది గంటలయింది. ఆ రోజుల్లా వరంధామయ్య ఆఫీసు బయట పడిగాపులు పడి ఉన్నాడు. చిరుదేవుడకి అతనిపై కరుణ కలిగి, బయటకొచ్చి "నీ పనయిపోయింది. ట్వంటీ ఫైవ్ పర్సంట్ ఇస్తున్నాను. నా కివ్వాల్సిన మూడువేలూ ఇచ్చి రేపు చెక్కు పట్టుకెళ్లు!" అన్నాడు.

"తమరు కరుణించాలి. చెక్కు కాష్ కాంగానే తమకు రావాల్సింది పువ్వుల్లో పెట్టి సమర్పించుకుంటాను!" అన్నాడు వరంధామయ్య.

"నా దగ్గర నీ తెలివితేటలు చూపించకు. చెక్కు చేతిలో కొచ్చాక మళ్లీ నువ్వు నాకు మొహం చూపిస్తావా? ఇవ్వాల్సింది ఇచ్చి, నీకు రావాల్సింది పట్టుకెళ్లు!" అన్నాడు చిరుదేవుడు.

"మిమ్మల్ని మోసం చేసి మేం బతగ్గలమా? మా అవసరాలు ఇంతటితో తీరిపోతాయా?"

"ఏం గోలయ్యా నీది! డబ్బిచ్చి చెక్కు పట్టుకెళ్లు, మాటలనవసరం!" అని కసిరి, మారు మాటకు అవకాశం లేకుండా లోపలకు వెళ్లిపోయాడు చిరుదేవుడు.

వరంధామయ్య కేం తోచలేదు. తను చిరుదేవుడి తల్లికంత సాయం చేశాడు కదా, డబ్బుకి తన్నంత నిక్కచ్చి చేయడనుకున్నాడు అతను. కానీ సర్వీసులో చేరిన కొత్తల్లోనే చేతులు తడిపే విషయంలో తల్లిని కూడా నమ్మకూడదని నేర్చుకున్నాడు చిరుదేవుడు. ఆలోచించగా, ఆ మూడువేలూ పెద్దల్లుడు సర్దుతాడేమో కనుక్కుందామనిపించింది వరంధామయ్యకు.

మర్నాడు పొద్దున్నే పెద్ద కూతురింటికి వెళ్లాడు. కూతురు ఆదరంగా కాఫీ ఇచ్చింది కానీ, పెద్దల్లుడు మాత్రం తన మూడో కూతురు పెళ్లి చేసినప్పటి నుండి అతనితో సరిగ్గా మాట్లాడటంలేదు, ముభావంగా ఉంటున్నాడు. అయితే అవసరం తనది కనుక, అప్పు విషయం ప్రస్తావించక తప్పలేదు వరంధామయ్యకు.

"మూడు వేలు సర్దగలిగితే, రెండు రోజుల్లో ఇచ్చేస్తాను, అల్లుడుగారూ!" అన్నాడు అతను.

అయితే, అప్పులు పుచ్చుకోవచ్చు కానీ, ఇవ్వకూడదనే సిద్ధాంతం బంగార్రాజుది. మామగారు అడక్క అడక్క అడిగాడని కూడా మొహమాట పడలేదు అతను.

"నా దగ్గర లేవండీ!" అన్నాడు.

"అలా అంటే నేను కష్టాల్లో పడిపోతా, నాయనా! కాళ్లరిగేటట్టు తిరిగి ఓ ఏభై వేలు అరియెర్స్ సంపాదించగలిగాను. ముడుపు చెల్లిస్తే గానీ మన చేతికి చెక్కు రాదు. కనుక నువ్వు ఎలాగైనా సరే నాకు సాయపడాలి. రెండ్రోజుల్లో నీ డబ్బు నీకు వాపసు చేస్తాను!" అని ప్రాధేయపడ్డాడు వరంధామయ్య.

'అరియెర్స్' అనేప్పటికి పెద్దల్లుడి బంగారు గుండె కరిగింది.

"సరే, అంతగా అడుగుతున్నారు కాబట్టి ప్రయత్నం చేస్తాను. పదకొండింటికి మా ఆఫీసుకొచ్చి తీసుకోండి!" అన్నాడు.

అంత తేలిగ్గా పెద్దల్లుడు అప్పు ఇవ్వ అంగీకరించటం చూసి తనావాళ లేచిన వేళా విశేషం మంచిదని సంతోషించాడు వరంధామయ్య. పదకొండు గంటలకు అల్లుడి ఆఫీసుకు వెళ్లి అతనిచ్చిన మూడు వేలు తీసుకుని, సీదా అటే విద్యాశాఖాలయానికి వెళ్లి, చిరుదేవుడికి మూడు వేలు సభక్తికంగా సమర్పించి, చెక్కు పుచ్చుకుని అటునుంచి అటే బాంకుకు వెళ్లి, చెక్కు డిపాజిట్ చేసి ఇంటికి తిరిగి వచ్చాడతను. వారం రోజులుగా తిరిగి తిరిగి ఒళ్లు అలసిపోయింది. అయినా మనసు ఆనందంగా ఉంది. మరి భగీరథ ప్రయత్నం చేసి ప్రభుత్వాన్నుండి ఏభైవేలు వసూలు చేసుకున్న వరంధామయ్య ఇంటికి వస్తూ తన మహద్భాగ్యాన్ని గూర్చి పాట పాడుకున్నాడంటే ఆశ్చర్యమేముంది!

భోజనం చేసి ఓ కునుకు తీసి, వచ్చే ఏభై వేల నెలా ఏయే అప్పులకి సర్దాలా అని లెక్కలు వేస్తూ కూర్చున్నాడు. మొత్తం అప్పులు ఎనభై వేలదాకా ఉన్నాయి. మార్వాడీ కొట్లో భార్య గొలుసు, గాజులు తనఖా పెట్టి పదిహేనువేలదాకా అప్పు తెచ్చాడు. అది ముందు తీర్చేయ్యాలి. ఆవిడ రోజూ అతన్ని సాధిస్తోంది. తనా సాధింపులు పడలేదు. ఓ తెలిసిన మిత్రుడి దగ్గర ముప్పై వేలు అప్పు తెచ్చాడు. ముప్పైవేలకు నెలకు మూడు శాతం చొప్పున తొమ్మిది వందల రూపాయల వడ్డీ చెల్లించటానికి తన పుఠమారుతున్నది. వచ్చే పెన్షన్‌లో అదే సగం

మింగేస్తోంది. ఆ ముప్పైవేలూ ముందుగా చెల్లించాలి. మరో మిత్రుడికి ఇరవై వేలివ్వాలి. పాపం అతను బాంకు వడ్డీకే అప్పిచ్చాడు. ఈ డబ్బులో అతనికివ్వటానికి పడదు. మెల్లగా నెలకింతని తీర్చాలి. ఇంకో పదిహేనువేలు చిల్లర మల్లర బాకీలున్నాయి. వాటినీ ప్రస్తుతానికి ఆపక తప్పదు. పెద్దల్లుడి దగ్గర పొద్దున మూడువేల రూపాయలు తెచ్చాడు. అతనికి వెంటనే తీర్చేయ్యాలి. అసలే ఖరాఖండి మనిషి. డబ్బివ్వకపోతే నోటికేది వస్తే అది అనేస్తాడు. తననుకున్న పద్ధతిలో బాకీలు చెల్లిస్తే, మరో రెండు వేలు మిగులుతాయి. అందులో ఓ జత చీరలు భార్యకు, ఓ జత పంచెలు తనకూ కొనుక్కోవాలి. తను వాడే ధోవతులు మరీ నీరుకావి పట్టివున్నాయి. కాస్తంత ఖరీదైనా మంచివి కొనుక్కోవాలి.

పొద్దు వాటారిపోయింది. చీకట్లలుముకుంటున్నాయి. పరంధామయ్య భార్య శారదాంబ వంట చేస్తోంది. అర్జంటు బాకీలు ముందు చెల్లించి, మిగతా వాళ్లకెలా సర్దిచెప్పాలా అని ఆలోచనలో పడి ఉన్న పరంధామయ్య ఒక్కసారిగా లైటు వెలిగినట్లుంటే ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. పెద్దల్లుడూ, రెండో అల్లుడూ వాళ్ల భార్యలతో వచ్చారు. కూతుళ్లూ, అల్లుళ్లూ సామాన్యంగా తమ ఇంటికి రారు. తన చిన్న కూతురు జాహ్నవికి లక్ష రూపాయలు కట్నమిచ్చి రెండేళ్లక్రితం పెళ్లి చేసినప్పటినుండీ, తమకేదో అన్యాయం జరిగిందని భావించి తన ఇంటికి రావటం మానుకున్నారు వాళ్లు. అందుకే వాళ్లిలా అకస్మాత్తుగా రావటంతో ఏదో తెలియని భయం కలిగింది పరంధామయ్యకు. ఏమైనా వాళ్లను ఆహ్వానించక తప్పలేదు పరంధామయ్యకు.

"ఇదిగో, ఏం చేస్తున్నావు ఇంట్లో? అమ్మాయిలు, అల్లుళ్లూ వచ్చారు!" అంటూ లోపలికి కేకపెట్టాడు అతను.

శారదాంబకు కూతుళ్లను చూడగానే సంతోషం కలిగింది. అల్లుళ్లకు మంచం వాల్చింది కూర్చోటానికి. కూతుళ్లు సరస్వతి, సరోజ తండ్రి పక్కనే చాపమీద కూర్చున్నారు. వాళ్లకు మంచినీళ్లిచ్చి, కాఫీ పెడదామని శారదాంబ లేచింది కానీ, పెద్దల్లుడు వారించాడామెను.

"కాఫీ కేంటిలెండి అత్తయ్యగారూ, తాగే వచ్చాం. మావగారికి అరియెర్స్ వచ్చాయి కదా, ఓ మాటనుకుంటే సరిపోతుందని వచ్చాం. రేపాయన డబ్బంతా తగలెట్టి మాకు ఒట్టి చేతులు చూపెడతారేమో అని, వేరే పనున్నా మానుకుని వచ్చాం. పిల్లల్ని కూడా తీసుకురాలేదు. ఆలస్యమైతే వాళ్లు బెంగపడిపోతారు. కనుక మాకు ఇవ్వాల్సిందేదో ఇస్తే మేం వెంటనే వెళ్లిపోతాం!" అన్నాడు బంగార్రాజు.

"నీ కివ్వాల్సింది మూడువేలేగా. రెండ్రోజుల్లో తెచ్చిచ్చేస్తాను!" అన్నారు పరంధామయ్య.

"అది ఎట్టాగూ ఇవ్వక తప్పదులెండి, మిగతాదాని విషయం మాట్లాడండి."

"మిగతాదేమిటయ్యా?" అనడిగింది ఆశ్చర్యపోతూ శారదాంబ.

"అదేంటమ్మా అలా ఆశ్చర్యపోతావు! జానీ పెళ్లికి మీ మూడో అల్లుడికి కట్నమెంతిచ్చారు? లక్ష! మా ఆయనకెంతిచ్చారు! ముష్టి పదిహేనువేలు. మిగతా ఎనభై ఐదు వేలూ ఇచ్చేస్తే ఇంక మిమ్మల్ని ఇబ్బంది పెట్టం!" అంది రెండో కూతురు సరోజ.

"నాకు మాత్రం ఎంతిచ్చారు? మీకు పదిహేను వేలన్నా ముట్టాయి. నాకిచ్చింది ఐదువేలు. నాకు తొంభై ఐదువేలు రావాలి!" అన్నాడు బంగార్రాజు.


"అప్పటి రేట్లనుబట్టి కట్నం ఇచ్చాం. అందుకు మీ తల్లిదండ్రులూ అంగీకరించారు. ఇప్పుడు రామచంద్రానికిచ్చినట్టు మీకూ ఇవ్వాలంటే నా వల్ల కాదు. నేను మీ కివ్వాల్సిందేం లేదు!" అన్నారు ఖరాకండిగా పరంధామయ్య.

"ఎందుకివ్వరండీ! మీరు అరియెర్స్ తెచ్చుకోరా? మాకు రావాల్సిన అరియెర్స్ ఇవ్వనంటే కుదరదు!" అన్నాడు బంగార్రాజు.

"పోనీ అడిగినంత ఇవ్వకపోయినా, మీ చేతనైనది ఇవ్వండి!" అన్నాడు రెండో అల్లుడు శివరావు.

"మీకు మాట్లాడటం తెలీదు మీ రూరుకోండి! అప్పులు ఎగ్గొట్టే వంశం కాదు మాది!" అంది సరోజ.

"అప్పంటావేమిటమ్మాయి! మేం మీకేం బాకీ లేం!" అంది శారదాంబ.




"అలా అంటే ఎలా కుదురుతుందే అమ్మా? సరోజ పెళ్లయినప్పటినుండీ ఆయన నా ప్రాణం తీస్తున్నారు, మిగతా పదివేలూ పట్టుకురమ్మని. అమ్మకు తెలియద్దా, అమ్మే ఇప్పిస్తుందిలెండి. మనం నోరు తెరచి అడగటం బావుండదని ఈ పదేళ్లనుండి ఆయన్ని పట్టుబలవంతాన ఆపాను. ఇంక నా వల్ల కాదు. జానీకి లక్షెందుకిచ్చారు కట్నం? మంచి సంబంధం, మంచి సంబంధం అని మోజుపడ్డారు కానీ, తరువాత వచ్చే పరిణామాలను గూర్చి ఆలోచించలేదు. నేను చెప్పినా నా మాట వినలేదు. ఇంత ఏడ్చింది ఈ కొంపలో పెద్దకూతురికి గౌరవం!" అని మెటికలు విరిచింది సరస్వతి.

"పదిహేను ఏళ్ల క్రితం మీ ఆయనకు ఐదు వేలిచ్చినా, పదేళ్లక్రితం శివరావుకు పదిహేను వేలిచ్చినా ఇప్పటి లక్షకంటే ఎక్కువే. అందువల్ల మీ మొగుళ్లకు తక్కువ కట్నమిచ్చా నని ఏడవాల్సిన పని లేదు మీకు!" అన్నాడు పరంధామయ్య.

పరంధామయ్య ఆ మాట అనేటప్పటికి పెద్ద గోలయింది.

"మాకు ఏడవాల్సిన ఖర్మేం పట్టలేదు. ఆ ఏడుపేదో మీరే ఏడవండి!" అన్నాడు బంగార్రాజు.

"పెద్దోడివి, నువ్వనాల్సిన మాటేనా అది, నాన్నా!" అంది సరోజ.

సరస్వతయితే కన్నీళ్లే పెట్టుకుంది. "ఇంక మనకు మిగిలింది ఏడుపే! మాకు రావాల్సింది ఎగ్గొట్టి నువ్వు బాగుపడవు, నాన్నా! కూతుళ్ల ఉసురు కొట్టకుండా ఉండదు!" అంది సరస్వతి ఎక్కిళ్లు పెడుతూ.

"చెప్పరేం, అలా మూగమొద్దులా కూర్చుంటే ఎలా? బకాయి చెల్లించకపోతే మీ నాన్న ఇంటిముందు నుండి కదలను అని నాకు చెప్పి ఏం ప్రయోజనం! ఆ మాటేదో మా నాన్నకు, అమ్మకు చెప్పండి!" అంది సరోజ.

"మామయ్యా! ఈ గోలంతా ఎందుకు, మీ దగ్గర ఉన్నదేదో ఇచ్చేయ్యండి!" అన్నాడు శివరావు భార్య పోరు పడలేక.

"నా దగ్గరేం ఉందయ్యా ఇవ్వటానికి?" అన్నాడు పరంధామయ్య దిగులు పడిపోతూ.

"ఏభై వేలు ఎరియర్స్ వచ్చాయిగా?"

"అది మీలో ఎవరికీ సరిపోదు. పైగా నాకు అప్పులున్నాయి. అవి తీర్చకపోతే అప్పిచ్చినవాళ్లు

ఊరుకోరు!"

"మరి మాకు ఎగ్గొడతావా? మాకంటే నీకు బయటివాళ్లే ఎక్కువయ్యారా?" అంది సరోజ.

"పదవయ్యా, శివరావూ! ఈయనిలా ఏదీ తేల్చనివ్వడు. కూతుళ్లు ఇంటిమీద పడి ఏడిస్తే గానీ ఈయనకు తెలిసిరాదు. ఇవాళనుండి నేను నా పెళ్లాన్ని ఏలుకోవటంలేదు. నీకు దమ్ముంటే, నువ్వూ మగాడివైతే లేచి నిలబడు, వెళ్దాం!" అన్నాడు బంగార్రాజు లేస్తూ.

"మా ఆయనా మగాడే. ఆయనకు దమ్ము లేకపోవటమేమిటి? నే నిక్కడే ఉంటా, మీరు వెళ్లండి!" అంది సరోజ.

"మీరు పెనుక్కు చచ్చినా పైసా ఇవ్వను!" అన్నాడు పరంధామయ్య.

"మీ నాయనకు కొవ్వు పట్టింది. నన్ను చావమంటున్నాడు!" అన్నాడు బంగార్రాజు భార్య వీపుమీద చరపు చరిచి.

"అయ్యబాబో! కన్నవాడూ, కట్టుకున్నవాడూ ఇద్దరూ కల్సి నన్ను చంపేస్తున్నారు బాబోయ్!" అని పెద్దగా అరుస్తూ నేలమీద పడి బోరున విలపించసాగింది సరస్వతి.

"అదేం మాయరోగమే, సరస్వతీ! ఎవరో చచ్చినట్టు నట్టింట పడి ఏడుస్తున్నావు!" అంది శారదాంబ.

"ఎవరో ఎందుకూ, నీ కూతుళ్లకే చచ్చే రోజు వచ్చింది!" అంటూ సరోజ కూడా బోరుమంది.

ఈ గోలంతా చూసి శారదాంబకు చిరాకు కలిగింది.

"ఆ వచ్చిందేదో వాళ్ల మొహాన కొట్టండి, వెళ్తారు. ఉంటే తిందాం, లేకపోతే పస్తుందాం!" అంది.

"రేపు నేను అప్పుల వాళ్లకేం పమాధానం చెప్పాలే? వాళ్లు నన్ను బతకనివ్వరు!" అన్నాడు పరంధామయ్య.

"వీళ్లూ అప్పులవాళ్లే. అందుకే కన్నాం. ఇల్లు అమ్మయినా అప్పులు తీర్చేద్దాం బయటి అప్పులు. ముందీ ఛీద్రాన్ని వదిలించెయ్యండి!" అంది శారదాంబ.

చేసేది లేక పరంధామయ్య చివరి అస్త్రం ప్రయోగించాడు.


"చూడండి, అల్లుళ్లూ! నాకు ప్రభుత్వం వారు మంజూరు చేసింది ఏభై వేలు మాత్రమే. అంటే నాకివ్వాల్సిన బకాయిలో ఇరవై ఐదు శాతం మాత్రమే. మీరనుకున్నట్టు మీ బకాయిలు చెల్లించాలన్నా లక్షా, ఎనభై వేలు కావాలి. అంత డబ్బు నా దగ్గర లేదు. నన్నొదిలేయండి, బాబూ! మీకు, మీ అబ్బలకో దణ్ణం!" అన్నాడు.

"లక్షా ఎనభైవేలంటే మా కెంత రావాలి?" అనడిగింది సరోజ.

"మీ ఆయనకు పెళ్లప్పుడు పదిహేను వేలు కట్నమిచ్చాడు కదా మావగారు. లక్షలో పదిహేను పోతే మీకు రావాల్సింది ఎనభై ఐదు. నాకు ఐదు వేలు ఇచ్చాడు కనుక నాకు తొంభై ఐదు వేలు!" అన్నాడు బంగార్రాజు.

"మీ ఎక్కువేం, మా తక్కువేం? చెరిసగం పంచుకుందాం!" అంది సరోజ.

"అది అన్యాయమే, సరోజా! అంత స్వార్థం పనికిరాదు నీకు!" అంది సరస్వతి.




"మీరెందుకు కొట్టుకు ఛస్తారు? అంత డబ్బు నా దగ్గర లేదు!" అన్నాడు పరంధామయ్య.

"ఆ సంగతి మాకు తెలీదా, మామయ్యా! మిమ్మల్ని ఇబ్బంది పెట్టి మేం మాత్రం బావుకునేదేముంది? గవర్నమెంటు మీకు బకాయిలు ట్వంటీఫైవ్ పర్సంట్ గ్రాంట్ చేసింది కదా. అలాగే మా అరియెర్స్‌లోనూ ఇరవై అయిదు శాతం ఇచ్చేయండి. మీకు మిగతా బకాయి డబ్బు వచ్చినప్పుడు మా బకాయి చెల్లించవచ్చు. మేమేం గొంతుమీద కూర్చున్నామా, ఇస్తావా ఛస్తావా అని!" అన్నాడు బంగార్రాజు.

"మహా న్యాయంగా చెప్పావు!" అన్నాడు శివరావు, భార్య కనుసన్నను గ్రహించి.

"ముందు వాళ్ల డబ్బు వాళ్లకిచ్చి పంపేయండి!" అంది.

బంగార్రాజు లెక్కలు కట్టాడు. తనకు అరియెర్స్ క్రింద రావాల్సింది ఇరవై మూడు వేల ఏడు వందల యాభై అనీ, పొద్దున తనిచ్చిన మూడువేలతో సహా వెరసి ఇరవై ఆరువేల ఏడువందల యాభైకి చెక్కు పుచ్చుకున్నాడు. శివరావుకు ఇరవై ఒక్క వెయ్యి రెండు వందల ఏభై చెక్కు ఇచ్చాడు పరంధామయ్య.

"మాకన్యాయం చేశావు, నాన్నా!" అని గునుస్తూ చెక్కు పుచ్చుకుంది సరోజ.

"గుర్తుంచుకోండి, మామయ్యా! నా కింకా అరియెర్స్ కింద రావాల్సింది రు. 71,250, సివరావుకు రు. 63,750. మాకు రావాల్సిందానికంటే మాకు పైసా ఎక్కువ అక్కర్లేదు. సరే, ఆ విషయం మళ్లీ మీకు బకాయిలు వచ్చినప్పుడు చూసుకుందాం. మీ రెక్కాడికిపోతారు, మే మెక్కాడికిపోతాం!" అన్నాడు బంగార్రాజు.

వచ్చిన ఏభై వేలల్లో భార్య గొలుసు తనఖాపెట్టి చిరుదేవుడికి ఇవ్వాల్సిన అడ్వాన్సుకోసం తెచ్చిన రెండు వేల రూపాయలు మాత్రం మిగిలాయి. అప్పుల వాళ్లకు సమాధానమెలా చెప్పాలో దిక్కు తోచలేదు పరంధామయ్యకు. చెక్కులు పుచ్చుకుని అల్లుళ్లు భార్యలతో సహా వెళ్లిపోగానే గోడకు చేరగిలపడిపోయాడు, నిస్సత్తువగా.

శారదాంబ భర్త పక్కన కూర్చుంటూ అంది. "ఎందుకూ, అంతలా ఇదయిపోతారు. ఇల్లు అమ్మేసి బాకీలు తీర్చెయ్యండి. ఇంక డబ్బేమన్నా మిగిలితే అది పుచ్చుకుని కాశీనో, రామేశ్వరమో వెళ్లి అక్కడే ఉందాం. ఈ చివరి రోజుల్లో పుణ్యమైనా దక్కుతుంది. జీవితమంతా యాతనగానే గడిచిపోయింది. మీరింక బకాయిలంటూ ఆ గవర్నమెంటు ఆఫీసులకు తిరక్కండి. అది వచ్చినా మన అమ్మాయిలు మింగేస్తారు. మనకు మిగిలేది సున్నకు సున్న హళ్లికి హళ్లి. ఇన్నేళ్లూ బతికాక జీవితం శూన్యమని నాకర్థమైంది. బంధనాల పీడా వదిలిందని సంతోషించక, మీరెందుకలా దిగులు పడతారు? లేచి స్నానం చెయ్యండి, భోజనం చేద్దాం!"

పరంధామయ్య భార్య సలహా పాటించాడు. 'అరియెర్స్' అంటూ మళ్లీ గవర్నమెంటు ఆఫీసుల చుట్టూ తిరగలేదు. గుట్టు చప్పుడు కాకుండా ఇంటిని నాలుగు లక్షలకు అమ్మేశాడు. స్వార్జితమవటం వల్ల కూతుళ్ల సంతకాలవసర పడలేదు. బాకీలు చెల్లించేసి, కూతుళ్లకు చెప్పకుండా కాశీకి వెళ్లిపోయారు, భగవధ్యానంతో బకాయి జీవితాన్ని గడపటానికి. ■